# చరమ గీతం

"ఈ విశాఖపట్టణం లాటి ఊళ్లో పరమేశ్వరుడు ప్రత్యక్షమయి ఏంకావాలో వరం కోరుకొమ్మంటే, ఆడ పిల్లల కాన్వెంటు ప్రక్కన తను తిరుగాడే ప్రేత భూమిని నాపేర రిజిష్టరు చేసెయ్యమని కోరుకుంటాను. దాంతో ఆకాన్వెంటు హాస్టలులోని ఆడపిల్లలకు శవాలుకాలే వాసనా తప్పుతుంది, నాకు ఊరి నడిబొడ్డుమీదున్న స్థలమూ కలిసొస్తుంది! ప్రేత భూమి అయితేనేం, దాన్ని ఇళ్ళప్లాట్లువేసి అమ్మేస్తే అంతాడబ్బే! లేదా నలభై రూములు కట్టిపడేస్తే పాలిటెక్నిక్ కుర్రాళ్ళందరూ అందులోనే అద్దెకు దిగుతారు బ్యాంకుల్లో డబ్బుదాచుకుంటే నూటికి ఏడు రూపాయలు వడ్డీ వచ్చేనుగాక! ఊళ్లోవడ్డీలకు తిప్పితే అసలు గల్లంతయి,

కేవలం ఫాయిదాలు మాత్రమే మిగిలే ప్రమాదం ఉంది! ఇనప్పెట్టెలో దాచి పెడితే దొంగలు ఎత్తుకు పోయే ఆస్కారం ఉంది. అందుకే మనం కూడబెట్టే ప్రతిపైసా ఇళ్ళ స్థలాల మీద పెచ్చిస్తే అంతకు మించిన వ్యాపారంలేదు! ఈ వూళ్లో ప్రతియేటా రెట్టింపుకు పైగా ధరలు పెరిగి పోతున్నాయి!"

కుడి చేతిలో నిలిచి కాలుతున్న లంకాకు చుట్ట మసిను దులుపుతూ, ఎడంచేతి చూపుడు వేలితో మీసాలను సవరించుకుంటూ; ఈ మాటలన్నది విశ్వపతిగారు!

విని ఆశ్చర్య పోయినవాణ్ణి నేను!!

చుట్టగట్టిగా పీల్చి మళ్ళీ ప్రారంభించేరు! "ఇదిగో! ఈ కిటికీలో నుండి చూడండి దూరంగా, ఆ తాటితోపు కనిపిస్తోందే అది లగాయతు అదిగో, ఆ జీడి మామిడి మొక్క వరకూ ఉన్న ఆమైదాన మంతా సుమారు ఆరేళ్ళ క్రితం ఎకరం పెయ్యిరూపాయలు చొప్పున కొన్నాను. ఈవేళ 'ఇళ్లప్లాట్లు' వేసి అమ్మితే, గజం నాలుగు రూపాయల చొప్పున ఎగరేసుకు పోయారు...అలాగే, డైరీ ఫారం అవతలకూడా బోలెడు స్థలాలు అమ్మేను. మట్టిని బంగారంగా మార్చవచ్చని మన పూర్వీకులు ఉత్తినే అన్నారుటండీ! మానాన్న దాన్ని సరిగా అర్థం చేసుకోక బ్రాహ్మణ వ్యవసాయం చేసి ఆ రెకరాల మడచెక్క అమ్మి పారేశాడ గాని, ఆయనే ఈ వ్యాపారం చేసివుంటే ఎంత బాగుండేదో..."

కాస్త దగ్గొచ్చి గొంతుక పట్టెయ్యడంతో, విశ్వపతి గారు మాటలు ఆపేరు! తనకి అంత దగ్గు తెప్పించిన చుట్ట వైపు ఒక్క-క్షణం కసిగా చూసి దాన్ని కిటికీలోంచి అవతలకి గిరాటేసేరు.

"అమ్మడూ! కాసిని మంచినీళ్లు పట్రా!" అంటూ గట్టిగాపిల్చి నావైపు తిరిగి "మీరు కాస్త కాఫీ తాగుతా రేమిటి? అయినా ఈ వెధవ కాఫీలు గుండెను పీల్చేస్తా యండీ! నే నిదివరకు రోజూ పదిమార్లు కాఫీ తాగేవాడిని! ఈదగ్గు రోగం పట్టుకున్నాకా పూర్తిగా మానేశాను..." అంటూవుంటే మళ్ళీ దగ్గుతెర ఆయన మాటలకు అడ్డొచ్చింది!

నేను కాస్త మొహమాటంగా "అబ్బే! ఇప్పుడే కాఫీ్రతాగి బయలుదేరి వస్తున్నానండీ! కొంచెం మంచినీళ్లు ఇప్పించండి, చాలు!" అన్నాను.

ఇంతలో సుమారు ఇరవై యేళ్ళ అమ్మాయి మంచి నీళ్ళ చెంబుతో వచ్చింది. అమె ఎవరో నేను ఊహించే లోగానే విశ్వపతిగారే అమెను పరిచయం చేశారు.

"...మా అమ్మాయి శకుంతల! దీన్ని భూమ్మీద పడేసినపుడు వాళ్ళమ్మకి పెద్దజబ్బు చేసింది! దాన్ని బాగు చేయించడం కోసం పదివేల రూపాయలు ఖర్చు చేశాను. కాని దక్కించుకునే భాగ్యం నాకు లేక పోయింది. అప్పటినుండీ ఈ పిల్లని నేనే సాక్కొస్తున్నాను." అని

ఆమెవైపు తిరిగి "అమ్మడూ! మరికొంచెం మంచినీళ్లు పట్రా!" అన్నారు.

శకుంతల తండ్రివైపు అదోరకం నిరసన భావంతో చూసి లోనికి వెళ్ళిపోయింది.

కంచుచెంబు ఎత్తి గడగడా నీళ్ళన్నీ త్రాగేశారు విశ్వపతిగారు!

వయస్సు ఆరుపదులు దాటినా ఇంకా నవనవ లాడుతూ బంగారుతీగె చెలుకగడలావున్నా రాయన! కొద్ది క్షణాలక్రితం కిటికీలోంచి చూపించిన మైదానం ఆయన బట్టతల కూడా శుభ్రంగా మెరిసిపోతోంది. కలుపు మొక్కల్లాగా పది పదిహేను తెల్లవెంట్రుకలు మరోపది నల్లవెంట్రుకలు, అన్నీకలసి రాజీపడి బట్టతల మీద ఒకే వైపుకు పరచుకున్నాయి. ఆయన మాట్లాడేటప్పుడు పెదాలు రెండూ వెడల్పుగా సాగిపోయి పక్కకు విడిపో తున్నాయి. నున్నని కొనదేరిన ముక్కు ఆయనలోని పట్టు దలని సూచిస్తూవుంటే నుదుటి మీద ముడుతల వలన ఏర్పడిన రేఖలు ఆయన అనుభవానికి ప్రతీకలుగా కనబడు తున్నాయి! ఉల్లిపొర కాగితం పెదాలకు అడ్డం పెట్టుకొని మాట్లాడు తున్నట్లు, ఆయన మాటలు బొంగురుగా ఉన్నాయి. ఆయన వేగంగా మాట్లాడేటప్పుడు ఆవేశంగాను మెల్లగా తగ్గుస్థాయిలో మాట్లాడేటప్పుడు కోపంగానూ కని పిస్తున్నారు.

ఆయన వయస్సులో వున్నప్పుడు చాలా అందంగా ఉండేవారని ఆయన ముఖమే చెప్తోంది. ఇప్పుడయినా ఆయనకు సూటు తొడిగి నిలబెడితే బట్టల మిల్లు అడ్వర్‌టయిజ్‌మెంటు బొమ్మలా తళుకుమంటూ ఉంటారు.

ఆయన విష్ణుమూర్తి పోజులో కూర్చున్న మంచానికి సుమారు నలభై ఏళ్ళ వయసుంటుంది. నిజం చెప్పాలంటే అది వడ్రంగి చేసిన మంచంలా లేదు. చేతకానివాడు చేసిన అనంత శయనంలా వుంది!!

ఆ గదిలోని చేతుల కుర్చీలకు ఒక్కదానికీ చేతు లేవు. కాస్త ఎగుడుదిగుడుగా కాళ్లుమాత్రం ఉన్నాయి. కుర్చీ కాస్త అటూఇటూ కదలినపుడల్లా కిర్రుమంటూ వింత శబ్దం చేస్తున్నాయి.

ఆ గది గోడకు ఒకవైపున పాల సముద్రం మీద తీరిగ్గా శయనించిన విష్ణుమూర్తివారి ఫోటోవుంది! ఆయన ముఖం అతి ప్రశాంతంగానూ, అతి ఆనందంగానూ లేదు. అతి చీకాకుగానూ, అతి కోపంగానూ కన్పిస్తోంది! ఆయన కాళ్ళ దగ్గర కూలబడిన లక్ష్మీదేవి ఆయన ఆదమరచి వున్నపుడు కాళ్లు విరిచెయ్యటానికి వచ్చిన గయ్యాళిలా ఉంది.

ఇంకోవైపు గోడకి సుమారు పదిహేను సంవత్సరాల క్రితం గుర్రాల బీడి కంపెనీవాళ్లు వేసిన అడ్డ బాసర లెట్టుకున్న భానుమతి కేలండరు ఉంది! అంతకు తప్ప ఆ గదిలో ముఖ్య వస్తువులేవీ నాకు కనబడలేదు.

"ఇదిగో తీసుకోండి!"

ఉలిక్కిపడి తలఎత్తి చూసేను. ఎదురగా శకుంతల నిలబడిఉంది నిమ్మనీళ్ళ గ్లాసుతో. గ్లాసు అందుకొని గడగడా త్రాగి క్రిందఉంచేను. విశ్వపతిగారు తువ్వాలుతో ముఖం తుడుచుకొని ఉస్సురంటూ ఒకమారు నిట్టూర్చి నావైపు చూస్తూ "అయితే ఇంతకీ మీకు ఎక్కడి ప్లాటు కావాలో చెప్పేరుకారు. ప్రస్తుతం నేను రెండు మూడుచోట్ల ప్లాటు వేసి అమ్ముతున్నాను. మీకు ఎక్కడకావలిస్తే అక్కడ తీసుకోవచ్చు. రెండోమూడో స్థలాలు కొనివుంచుకుంటే ఆరునెలలు తిరిగే సరికి రెట్టింపుధర పలుకుతాయి." అన్నారు.

"అబ్బే! నేను కొందామనే ప్రయత్నంలో లేనండీ! అదీకాక అన్ని స్థలాలు కొనేతాహతు కూడా నాకులేదు. అయిదువందల గజాలు కొంటే ఏనాటి కయినా ఒక ఇల్లు కట్టుకో వచ్చని నా ఉద్దేశం" అంటూ కాస్త బిడియంగా నా అశక్తతను వెల్లడించేను. ఆ క్షణంలో కనీసం రెండు ప్లాట్లయినా కొనే తాహతు లేనందుకు ఎంతో సిగ్గుపడిపోయేను కూడా!! విశ్వపతిగారు నావంక కాస్త చికాకుగా చూశారు.

"ఏమండోయ్! మీ పద్ధతి నాకేం నచ్చలేదు! దేనికయినా కలేజా వుండాలండీ! నాపెళ్ళిజరిగే నాటికి నాకు దమ్మిడీ ఆస్తిలేదు. నానెత్తి మీద రూపాయి పెట్టి వేలం వేస్తే మా ఆవిడ అర్థరూపాయికి కూడా కొనివుండేదికాదు.

అయితే ఇదంతా ఎలా ఆర్జించే ననుకున్నారు?" అంటూ నా ముఖంలోకి గుచ్చిచూశారు. తెలియదన్నట్లు వెర్రిగా తల వూపేను.

ఆయన గట్టిగా నవ్వేరు.

తరువాత మీసాలు సవరించుకుంటూ "అప్పుచేసే నండీ!" అన్నారు. అదేదో భగీరథ ప్రయత్నంలో గంగను భూమికి దింపిన విషయంలా చెప్పేరు.

"దొరికిన చోటల్లా ధైర్యంగా అప్పులు చేసేను. స్థలాలుకొని ఇళ్ళస్లాట్లు వేసి రెట్టింపు ధరలకు అమ్మి అప్పులు తీర్చేను. ఈలాటి విషయాలకు తెగువ కావాలండీ!" అంటూ నాకు ధైర్యం చెప్పేరు.

ఆముసలాయన తత్వానికీ, ధైర్యానికీ ఆశ్చర్య పడకుండా వుండలేక పోయాను. అయితే నాకు చివరకూ ఆశ్చర్య పడటమే మిగిలింది కాని ఆయన చెప్పిన కలేజా వుండాలనే మాటతో పూర్తిగా రాజీమాత్రం పడలేక పోయాను. ఎందుకంటే అప్పులు చెయ్యడం కేవలం కలేజాతో కూడుకున్న పనే అని నేను అనుకోను. అప్పుచేసి తరువాత తీర్చలేక తాకట్లు పెట్టడం నాకు ఇష్టమయిన పనులు కావు.

ఆయన చెప్పినట్లు ఇప్పుడు కొని పడేస్తే ఎప్పుడో ధరలు పెరిగినపుడు డబ్బురావచ్చును గాక! కాని పిండి కొద్దీరొట్టె అన్న సామెత మాత్రం మరిచిపోలేను! అందుకే

అదే అభిప్రాయాన్ని ఆయనతో వ్యక్తం చేసేను. ప్రస్తుతం అయిదు వందల గజాలకంటె ఎక్కువ కొనలేనని డబ్బు చాలదనీ చెప్పేను. ఆయన కాస్త చికాకుగా "సరే అయితే ఒక్కక్షణం కూర్చోండి! ఇప్పుడే వస్తాను" అంటూ లోనికి వెళ్ళి అయిదు నిమిషాల్లో ప్లాను కాగితం, టేపు పట్టుకొని వచ్చారు. ప్లానులో నాకు కావలసిన ప్రాంతం చూపించాను స్థలాల వైపు బయలుదేరి నడిచాం!

ఇంకా ఆ ప్రాంతం పూర్తిగా అభివృద్ధి కానందువలన ఒకటో రెండో ఇళ్లు మాత్రం లేచాయి. మైదానం నిండా బలిసిన బలుసు పొదలు ముళ్ళకంచెలు వున్నాయి. అన్నిటినీ తప్పించుకుంటూ నడుస్తూ ఆయన వ్యాపార విషయాలే మాట్లాడుతున్నారు. నిజానికి విశ్వపతిగార్ని నేను కలియడం ఇదే మొదటిసారి అయితే ఎంతో సన్నిహితుడయిన ఆప్త మిత్రునితో మాట్లాడుతున్నట్లు ఆయన నన్ను పలకరిస్తున్నారు మందలిస్తున్నారు!

ఇరవై నిమిషాలలో ప్లానులో ప్రాంతం దగ్గరకు చేరుకున్నాం "ఇదిగో ఈ ప్లాటు చూడండి దక్షిణ తెరిపిన ఉంటుంది. గాలికి కొదవ వుండదు. వెయ్యిగజాల అవతలి నుండి ముప్పయి అడుగులరోడ్డు వెళ్తోంది. రోడ్డు చివరనే ప్లాను ప్రకారం హైస్కూలు, మార్కెట్టు వస్తాయి. నాలుగయిదు సంవత్సరాలలో ఇదంతా పెద్ద కాలనీగా మారిపోతుంది."

అంటూ విశేషాలు వివరిస్తూ టేపు బయటకు లాగి ఇదిగో ఈ చివర పట్టుకోండి! అంటూ నాకు అందించేరు.

కొత్తలు కొలిచి ఆనవాళ్లుగా రాళ్లు నిలబెట్టేం. తరువాత అక్కడకు దగ్గరలోవున్న ఒకగోతి వద్దకు తీసుకెళ్లేరు "ఇదిగో చూడండి నూయి తవ్వించేను, ఎనిమిది అడుగుల్లో కొబ్బరి నీళ్ళలాటి జలపడింది." కాస్త ముందుకు! అదిగో ఆ కొండ చరియ వరకూ వెళ్ళివద్దాం! రండి! అంటూ ముందుకు నడిచేరు.

మంత్ర ముగ్ధుడిలా ఆయనను అనుసరించేను.

చిన్న చిన్న గోతులు, డొంకలు తప్పించు కుంటూ కొండవరకూ నడిచేం. కొంతదూరం వెళ్లేక ఒక బండ రాయి దగ్గర ఆగిపోయారు. "ఈ స్థలం చూశారా! ఈ కాలనీకి ఇది శివారు అన్నమాట! ఇక్కడితో స్థలాలు అయిపోయాయి. ఇదే ఆఖరిప్లాటు ఈ స్థలం అమ్మకుండా మినహాయించి వుంచ దల్చుకున్నాను. ఎందుకో తెలుసా?" అన్నారు నా ముఖంలోకి చిరునవ్వుతో చూస్తూ.

"మీరు మరో ఇల్లు కట్టుకుంటారా?" అన్నాను. కాదన్నట్లు తల అడ్డంగా ఊపేరు.

"ఇక్కడ ఒక సమాధి లేస్తుంది" ఇంతవరకూ వున్న చిరునవ్వు మాయమై ఆయన ముఖంలో గంభీరత నిండింది.

నేను తుళ్ళిపడ్డట్టు ఆయన వంక చూసేను.

"ఏమిటి? సమాధా?!" అన్నాను నా ఆత్రుత అణుచుకోలేక

"అవును! నా సమాధి లేస్తుంది!"

ఈసారి మరింత గగుర్పాటు కలిగింది.

"నాకు ఈ కోరిక ఒక్కటే మిగిలింది. నా జీవితం అంతమయ్యాక ఇక్కడ నా సమాధి కట్టించాలి. ఈ కాలనీకి నాపేరు చిరస్మరణీయంగా నిలిచిపోవాలి. సమాధి చుట్టూ పూల మొక్కలు పెంచి అందంగా తయారు చేయటంకోసం ఇంత జాగా వదిలేశాను. ఎలాగూ ఊరికి ఎడంగా కాలనీకి శివారులో వుంది కనుక ఇక్కడ నా దహనానికి ఎవరికీ ఎలాంటి అభ్యంతరమూ ఉండదు." ఆవేశంగా చెప్తూ ముందుకి నడుస్తున్నారాయను.

ఆశ్చర్యంతో ఆయన చెప్పే విషయాలు వింటూ ఆయన వెనకే అడుగులేస్తున్నాను. 'ఆడపిల్లల కాన్వెంటు ప్రక్కనున్న ప్రేతభూమిని ప్లాట్లుగావేసి అమ్మేస్తానని గంటక్రితం చెప్పిన ముసలాయన తన ఇంటి స్థలాలలో తన ప్రేతభూమిని కేటాయించు కుంటున్నాడు!

ఆయన విచిత్ర మనస్తత్వం అంతు బట్టలేదు నాకు!

"ఇంక వెళ్ళిపోదాం!" అంటూ వెనక్కు మళ్ళేరు.

"ఇంతకీ ఈ విషయం ఎందుకు చెపుతున్నానో తెలుసా?" అన్నారు మెల్లగా నడుస్తూ.

"ఊహూ! తెలియదు! చెప్పండి!!" అన్నాను.

"మా అమ్మాయితో ఈ విషయం చాలా సార్లు చెప్పాను. అది తప్పక ఈ కార్యం నెరవేరుస్తుందని నాకు నమ్మకం వుంది. అయితే అది తప్పటడుగులేస్తే మీరు జ్ఞాపకం చేస్తారని మీకు చెపుతున్నాను."

"ఇలాటి విషయాలన్నీ ఇప్పుడు అనుకోడం ఏం బాగాలేదండీ మీరు నూరేళ్లు బ్రతుకుతారు!" అన్నాను.

కొంత సేపు ఆయన దేహ దారుఢ్యాన్ని పొగిడేను కూడా!

"ఈ జీవుడు 'హరీ' మనటానికి ఎంత సేపు కావాలండీ! మనం ఇలా నడిచి ఇంటికి వెళ్తామనే గ్యారంటీ ఏముంది? ఏనుగుల్లాటి మనుషులు క్షణంలో పీనుగులయిపోతున్నారు." అంటూ వేదాంతం ప్రారంభించేరు.

"జీవనంబు క్షణ భంగురంబు..."అన్నారు.

"తనువు కేవలం అశాశ్వతం..." అన్నారు కొంత సేపు.

"జీవితం బొత్తిగా నీటి బుడగ" అన్నారు మరి కొంత సేపు అయితే ఎంత సేపు చెప్పినా జీవితం అశాశ్వితమనే చెపుతున్నారు కానీ "డబ్బు శాశ్వితం కాదు" అనే ముక్క ఆయన నోటినుండి వెలువడటం లేదు.

వీటన్నిటినీ మించి ఆయన సమాధి అక్కడ లేవా లనే తలంపు ఆయనకు చాలా బలంగా వున్నట్లు మిగిలిన మాటల వలన గ్రహించేను.

విశ్వపతిగార్ని ఇంటివద్ద దిగవిడిచి; మరునటివారం ఇంటిస్థలం ఖరీదు విషయం ఖాయిలా పరుచుకునేందుకు వస్తానని చెప్పి బస్సుస్టాపువైపు బయలుదేరాను.

కొనబోయే స్థలంగురించీ, విశ్వపతిగారి మాటల్ని గురించీ ఆలోచిస్తూ నడుస్తున్నాను.

"కృష్ణా!" అన్న పిలుపుతో ఆలోచనలకు, కాళ్ళకూ బ్రేకులు పడ్డాయి. వెనుతిరిగి చూశేను.

"కృష్ణా! నిన్నే! అన్న పిలుపుతో కాస్త దూరాన వున్న పెంకుటింటి వైపుచూసేను, ఆయింటివీధి కిటికీలోంచి ఎవరో పిలుస్తున్నారు, చెయ్యివూగిస్తూ.

గబగబా అటువైపు నడిచేను.

వీధి తలుపులు తెరుచుకొని నవ్వుతూ ఆ ఇంట్లోంచి బయటకు వచ్చేడు ఆనంద్.

"అరె! నువ్వా! ఇక్కడున్నావేమిటి? ఏకవచన ప్రయోగంతో పిలుస్తుంటే ఎవరో అనుకున్నా!" అంటూ వాణ్ణి కౌగలించుకున్నంత పని చేశాను.

"ముందు లోపలికి నడు! అన్నీ మాట్లాడుకుందాం!" అంటూ ఆప్యాయంగా నాచేతులు పట్టుకొని ఇంట్లోకి తీసుకెళ్లేడు.

పడక కుర్చీవాల్చి తనువెళ్ళి ఫేనువేసి వచ్చాడు.

"ఏమిట్రా సంగతులు? కాలేజీ రోజుల్లో బలిసిన ఏనుగులా వుండే వాడివి! ఇప్పుడేమిటి, ఇలా రూళ్ళకర్రలా తయారయ్యావ్? కొంపదీసి మీ ఆవిడ భోజనం సరిగా పెట్టడం లేదా? ఊఁ!...ఎంతమంది పిల్లలు? ఉద్యోగం ఎలావుంది? ఉద్యోగంలో ఏ మాత్రం వెనకేశావ్?" అంటూ ఏకధాటిని నామీద ప్రశ్నల వర్షం కురిపించేడు ఆనంద్.

"ఒరేయ్, ఆపరా బాబూ! నువ్వు వరసగా ప్రశ్నలు వేస్తుంటే నేను సమాధానాలు చెప్పడం బహు కష్టమై పోతుంది. రూళ్ళకర్రలా తయారవడానికి కారణం విశాఖపట్నం నీళ్లు! మా శ్రీమతి రెండు పూటలా కొండొకచో మూడు పూటలా సుష్టుగా తిండి పెడ్తోంది. ఇద్దరు రాక్షసులు! ఉద్యోగం హాయిగా ఉంది! నా వెనక డబ్బు వేసుకుంటూ పోతే ఇహ ఏమీ మిగలదని తగుమాత్రం సొమ్ము బ్యాంకులో దాచుకున్నాను. ఇహచాలా? నన్ను ప్రశ్నలతో చంపక నువ్వు ఇక్కడ ఎందుకున్నావో ముందు చెప్పు. ఆమధ్య హైదరాబాదులో ఏదో ఉద్యోగం చేస్తు

న్నావనీ విన్నాను." అంటూ ఆనంద్ ధాటి ఇక నామీద పడకుండా ఎదురు ప్రశ్నలువేసి జాగ్రత్త పడ్డాను.

"ఈ మధ్య నాన్నగారి ఆరోగ్యం కొంచెం పాడయింది. ఆస్తి వ్యవహారాలు చూడటానికి ఇంకెవరో లేరుగా! అందుకని ఉద్యోగం మానేసి ఇక్కడకు వచ్చేశాను. ఈ ఇల్లు ఏడాదిక్రితం నాన్నగారు కట్టించేరు." అంటూ క్షణం మాటలు ఆపి "అవును నువ్వు మా శ్రీమతిని చూడలేదు కదూ! ఎలా చూస్తావులే! మా పెళ్ళికి నువ్వు రాలేదుగా! మా ఆవిడని పిలుస్తానుండు" అని "పద్మా!" అంటూ కేక పెట్టాడు. లోపలినుండి ఆవిడ బయటకు వచ్చింది. "పద్మా! వీడే నా మిత్రుడు కృష్ణ! కథలు వ్రాస్తూ ఉంటాడని చెప్పిన ఆ దౌర్భాగ్యుడు వీడే! మేమిద్దరం కాలేజీ రోజుల్లో రెండు డబుల్ కేరియర్లు తెప్పించుకొని ఒకటే కంచంలో పెట్టుకు తినేవాళ్ళం, నేను బద్దకమేసి కంచం పక్కనే నిద్రపోయేవాడ్ని. వీడు నా మంచం మీద నిద్రపోయేవాడు. ఒకే సిగరెట్టు మేమిద్దరం కలిసి కాల్చిన రోజులుకూడా వున్నాయి! అంత స్నేహం మా ఇద్దరికీ? "అంటూ వుంటే ఆమె చిరునవ్వుతో 'నమస్కారం' మావారు మీ గురించి ఎప్పుడూ చెప్తూవుంటారు. పత్రికల్లోపడే మీ కథలు నేను చదువుతూ వుంటాను! చాలా బాగుంటాయి!" అంది.

ఆనంద్ ఆమె మాటలకు అడ్డు పడ్డాడు.

"ఇహ ఆపు! వాడికథల్ని మాత్రం పొగడకు? వాణ్ణి ఇహాపట్టుకోలేం. నిజంగా వీడు నీ అభిమాన రచయితే అయితే అర్జెంటుగా రెండు కప్పుల కాఫీ కలిపి తీసుకొచ్చి మాకిద్దరికీ ఇయ్యి! అంతేకాని ఇలాటి పొగడ్తలు మాత్రం వద్దు!" అన్నాడు.

ఆవిడ నవ్వుకుంటూ కాఫీ తీసుకురావటానికి లోనికి వెళ్ళింది.

"ఇప్పుడేం వద్దురా? విశ్వపతిగారింట్లో ఇప్పుడే కాఫీ తాగి వస్తున్నాను!" అంటూ మొహమాటానికి అబద్ధం ఆడేను.

"నువ్వుండరా నాయనా? ఈ విధంగా నయినా మా ఆవిడ నాకు మరో కప్పు కాఫీ ఇస్తుందని చూస్తున్నాను?"

"అది సరేకాని ఏ విశ్వపతిగారి సంగతి నువ్వు చెప్పేది?" అంటూ నా ముఖంలోకి అనుమానంగా చూసేడు.

"ఈ వీధి చివర్నలేరూ ఆ విశ్వపతిగారే! ఇళ్ళ స్థలాలు అమ్ముతారు కదూ. ఆయనే!"

"ఆయన నీకు బంధువేమిటి కొంపదీసి!" అన్నాడు ఆనంద్ నావైపు అదోలా చూస్తూ.

"అబ్బే! అదేంలేదు! ఒకప్లాటు తీసుకుందామని వెళ్ళేను. ఇదే మొదటిసారి ఆయన్ను కలుసుకోటం" అన్నాను.

ఈసారి ఆనంద్ బిగ్గరగా నవ్వేడు.

"ఒకేయ్! 'ఆడ్రీహెప్‌బర్న్' నిన్న అర్ధరాత్రి నిన్నుకోరి మీ ఇంటికొచ్చి తలుపు తట్టిందని చెప్తే నమ్ముతాను. ఈ విశాఖపట్నం రోడ్లు డ్రయినేజి గోతులు అన్నీ మరో పది సంవత్సరాలలో బాగుపడి పోతాయని చెప్తే నమ్మటానికి ప్రయత్నిస్తాను! కాని ఆ విశ్వపతిగారు నీకు కాఫీ ఇచ్చాడంటే చచ్చినా నమ్మను. ఆయన పెంపుడు కాకికి కూడా ఎడంచేత్తో ఎంగిలి మెతుకు విదపడు. ఇంటి కొచ్చిన వాళ్ళందరికీ కాఫీలు ఇచ్చేరకమయితే ఇన్ని వేల రూపాయల ఆస్తి ఎలా కూడబెట్టేడనుకున్నావ్? ఇన్ని వందల ప్లాట్లు ఎలా సంపాదించాడనుకున్నావ్. శకుంతల పురిటిలో ఆయన పెళ్ళానికి జబ్బుచేస్తే మందులకు కానీ ఖర్చుపెట్టకుండా ఆవిణ్ణి చంపేశాడట! ఒత్తి పిసినిగొట్టురా బాబు ఆయన!" అన్నాడు.

ముసలాయన తత్వం నాకు కొంచెం అవగాహనకు వచ్చింది.

"కాఫీ ఇవ్వలేదనుకో! నిమ్మకాయ నీళ్లు ఇచ్చారు" అన్నాను నవ్వుతూ.

బహుశః ఆయన మంచినీళ్ళే ఇవ్వమని చెప్పివుంటాడు. ఆపిల్ల కాస్త చొరవచేసి నిమ్మకాయ అందులో పిండి వుంటుంది. ఆ నేరానికి ఈసరికి ఆయన శకుంతలని తిట్టే వుంటాడు."

నాకు శకుంతల ముఖం జ్ఞాపకానికి వచ్చింది. ఆనంద్ మళ్ళీ అన్నాడు! "ఇంతకీ ఆ పిల్ల హాయిగా మొగుడితో కాపురం చేసుకోక ఇక్కడే ఎందుకుం దనుకుంటున్నావ్?"

నేను ఆశ్చర్యంతో వాడివైపు చూసేను.

"ఏమిటి? ఆ పిల్లకు పెళ్ళయిందా?"

"రెండేళ్ళ క్రితమే అయింది? అల్లుడికి పది వేల రూపాయలు కట్నమిస్తానని మూడుముళ్ళు పడ్డాక ఇవ్వను పొమ్మన్నాడు ఆయనకి డబ్బుకి వున్న లంకె అలాంటిది.

'ఆ డబ్బుకక్కితే కాని నీకూతుర్ని నేను కాపురానికి తీసుకెళ్ళను!' అని కొత్తకుండ కొని తెచ్చి దాన్ని వీళ్ళ ఇంటి అరుగుమీదే పగలకొట్టి చెప్పి, వెంకులేనా ఎత్తకుండా చక్కాపోయాడు ఆ అల్లుడు.

అల్లుడు వెళ్ళిపోతూంటే విశ్వపతిగారు నానా దుర్భాషలూ ఆడేరు. 'నా కూతుర్ని నీ ఇంటికే పంపను. అసలు దానికి పెళ్ళే అవలేదనుకుంటాను. అది నా దగ్గరే వుంటుంది' అని కుప్పిగంతులు వేసి కూతురిమెళ్లో పుస్తెలు తెంపేసి కొంపలోనే వుంచేసుకున్నాడు. డబ్బిస్తేగాని మొగుడు రానివ్వడు! ముసిలాడు తన బొందిలో ప్రాణం వుండగా డబ్బివ్వడు! పాపం ఆపిల్ల ఎటూ తేల్చుకోలేక ఈ రెండు సంవత్సరాల నుండి ముసిలాడికి వండి పెడుతూ ఇక్కడే వుండిపోయింది."

నేను ఆనంద్ మాటలు నమ్మలేనట్లు విన్నాను.

శకుంతల వంటి అందమయిన అమ్మాయి యెడల ఆ మొగుడు అంత క్రూరంగా ప్రవర్తించ గలిగేడంటే నేను విశ్వసించలేక పోయాను. అదే మాట ఆనంద్‌తో అంటే నామీద కస్సు మన్నాడు.

"నా దృష్టిలో అల్లుడు చేసిన పని సరియైనదే అంటాను. కట్నం ఇవ్వనని ముసిలాడు ముందే ఎందుకు చెప్ప కూడదు? ఇస్తానని ఎందుకు మోసం చెయ్యాలి? ఇంతకీ కూతురికీ అల్లుడికీ ఇవ్వకుండా ఈ ఆస్తిని అంతా ఏం చేసు కుంటాడు?" అన్నాడు.

ఇంతలో పద్మ, కాఫీలతో వచ్చింది!

కాఫీ త్రాగటం ముగించి నేను విశ్వపతిగారి వద్దకు వచ్చిన పని వివరాలు చెప్పేను.

నేను చెప్పినదంతా ఓపిగ్గ విన్నాడు ఆనంద్.

"విశ్వపతిగారు రిజిష్ట్రేషను సమయంలో చాలా అన్యాయాలు చేస్తాడు. డాక్యుమెంట్లు సరిగా చూసుకోపోతే నువ్వు దెబ్బతింటావ్. ఆయన అమ్మిన భూమి మళ్ళీ ఆయనకే చెందేటట్లు బోలెడంత చాకచక్యంతో ఆయన రాయించిన డాక్యుమెంట్లు అనేకం నాకు తెలుసు. అదీకాక ఆయన అమ్మే కొన్ని భూములు మీద అనేక లావాదేవీలు వుంటాయి. అవన్నీ సరిచూసుకోకపోతే మళ్ళీ ఆయనతో కోర్టుకు తిరగాలి కనుక జాగ్రత్తగా చూసుకొని మరీ ఈ రంగంలోకి దిగు!" అంటూ హెచ్చరించేడు! తరువాత

చాలా సేపు మా కాలేజీ సంగతులు అవీ ముచ్చటించు కున్నాం. సాయంత్రమయ్యాక నన్ను సిటీ బస్సు ఎక్కించి వెనక్కి వెళ్ళి పోయాడు ఆనంద్.

*　　*　　*　　*

ఆ మరుసటి ఆదివారం పాటకు అడ్వాన్సు ఇవ్వటం కోసం విశ్వపతి గారింటికి వెళ్లేను. వీధి తలుపులుమూసి వుండటం వలన వరండాలో ఆగి తలుపు తట్టబోయేను! లోపలినుండి విశ్వపతిగారి కంఠం బిగ్గరగా వినిపిస్తోంది.

"...ఇదిగో! ఆ వెధవ సంగతి మళ్లీ ఎత్తావంటే నిన్ను పీకపిసికి నూతిలో పారేస్తాను. చిల్లుకానీ విలువ చెయ్యడు. ఆ క్లార్కు వెధవకి నేను పదివేలు కట్నం ఇవ్వాలా?

ఇవ్వని నేరానికి నిన్ను వదిలేస్తాడు? వాడొచ్చి నా కాళ్ల మీదపడి బ్రతిమాలినా నిన్ను వాడి దగ్గరకు పంపించను..."

శకుంతల ఏడుపు సన్నగా వినిపిస్తోంది!

తరువాత కొంత సేపు నిశ్శబ్దం!!

మెల్లగా తలుపు తట్టేను!

ఆ! వస్తున్నా" అంటూ విశ్వపతిగారు వచ్చి తలుపు తెరిచేరు.

"ఓ! మీరా! ఎంతసేపయింది వచ్చి?" అంటూ ఆహ్వానించేరు. ప్లాటులను గురించిన విషయాలన్నీ చాలా సేపు మాట్లాడేను. రేటుకూడా నిర్ణయించి అయిదు వందల రూపాయలు అడ్వాన్సుగా ఇచ్చేను. అడ్వాన్సు ముట్టినట్లు రసీదు ఇమ్మన్నాను. "సార్! మనిషిమీద నమ్మకాలు వుండాలిగాని ఈ రశీదులవీ ఎందుకు? అయినా మీరు ఇమ్మన్నారు కనుక ఇస్తాను." అంటూ రాసిఇచ్చేరు. ఆయన మాటల ధోరణి, తత్వం చూస్తుంటే ఆనంద్ చెప్పిన విషయాలు నాకు జ్ఞాపకానికి వచ్చేయి.

ఏది ఏమయినా ఈ విషయంలో నేను మొహ మాటం పెట్టుకో దల్చుకోలేదు.

మొత్తంమీద ఆ దినం వ్యవహారం పేచీ లేకుండానే సాగి పోయింది.

ఆ తరువాత పదిహేను దినాల్లోనూ కనీసం నాలు గయిదు సార్లు ఆయన వద్దకు వెళ్ళేను ప్లానులో కనిపించిన కొన్ని అనుమానాలు తీర్చుకోవడం కోసం అమ్మకానికి సంబంధించిన డాక్యుమెంట్లు తిరగెయ్యడం కోసం. ఈ విధంగా ఆయన్ని కలియటం జరిగింది! ప్రతిమారూ ఆప్యాయంగానే పలుకరించేవారు. అలా తిరగటం వలన ఆయనకూ నాకూ మధ్యవున్న సాన్నిహిత్యం మరికాస్త బలపడింది. నేను వెళ్ళినపుడల్లా ఆయన కష్టసుఖాలు నాతో చెప్పుకొనేవారు. ఐతే అల్లుడ్ని గురించిన ప్రసక్తి

మాత్రం మా మధ్యరాలేదు. ఆయన అనంతరం కట్టించ వలసిన సమాధిని గూర్చి మాత్రం ప్రతి పర్యాయం చెప్పే వారు. ఆయనకు ఆకోరిక చాలా బలంగా వున్నట్లు గ్రహించ గలిగాను.

కొంచెం కాలం తర్వాత ఒక మంచి రోజున నా ఇంటి ప్లాటు రిజిష్ట్రేషను జరిగిపోయింది ఏ పేచీలు లేకుండానే.

◆ ◆ ◆ ◆

ఒక సంవత్సరం సుమారు గడిచిపోయింది. నేను కొన్న స్థలం చుట్టూ అక్కడక్కడ ఇళ్లు లేచాయి! ఇంకొన్ని గోడల ఎత్తుకి లేచాయి. స్తోమత లేని నా వంటివాళ్ళ స్థలాలు యింకా ఖాళీగానే వుండిపోయాయి. ఆ ప్రాంతంలో ఒక మార్కెట్టు కూడా కట్టబోతున్నట్టు తెల్సింది.

ఇప్పుడు చదరపు గజం రేటు ఎనిమిది రూపాయల వరకూ పెరిగిపోయింది. విశ్వపతిగారు ఆనాడు చెప్పినట్లు రెండో మూడో స్థలాలు కొనివుంటే చాలా లాభం వచ్చి వుండేదికదా! అని నేను విచారించిన క్షణాలు కూడా లేక పోలేదు.

నా ఉద్యోగంలోని బాధ్యతలు పెరగడం వల్లనయితే నేం, ఇతర చిక్కుల వల్లనయితే నేం క్షణం తీరిక లభించక పోవడం వలన ఈ మధ్య విశ్వపతిగార్ని కలవ లేక

పోయాను. సుమారు ఆరునెలల క్రితం ఆయన వద్దకు వెళ్ళినపుడు ఆయన మంచం మీద వున్నారు. పక్షవాతం వచ్చి పాపం మంచం పట్టేరాయన! నేను వెళ్ళినపుడు మామూలు స్వరంతోనే పలకరించి తన బాధల్ని వర్ణించేరు. ఇంకా అమ్మవలసిన స్థలాలు బోలెడు ప్లాట్లువేసి వుండిపోయాయనీ ఇంతలో తనకా మాయదారి రోగం ముంచు కొచ్చిందనీ వాపోయారు! కనీసం ఆయన పడుకునే మంచం తలవద్ద రామాయణం లాటి గ్రంథం ఏదయినా కనిపిస్తుందేమోనని పరికించాను. కాని అక్కడ కూడా ఇళ్ళ ప్లానులు, లావాదేవీ కాగితాలే వున్నాయి! ఆయనకి నిర్మించవలసిన సమాధి ఏ మోడల్‌లో రావాలో పలక మీద పుల్లతో గీసి చూపించేరు. నన్ను సాధ్యమైనంత తొందరలో అప్పుచేసి అయినా సరే ఇల్లు కట్టేసు కొమ్మని ప్రోత్సహించేరు. వైజాగులో స్వంత ఇల్లు లేకపోతే రెండు వేలు జీతం వచ్చినా సుఖం లేదన్నారు! ఇలాగే బోలెడు సలహాలు యిచ్చేరు! పక్షవాతంతో మంచం ఎక్కి-నా, ఆయన గొంతులో జీర, గాంభీర్యం ఏ మాత్రం తగ్గలేదు. నేను బయలుదేరి వెళ్ళబోయేముందు తరచూ వస్తుండమని చెప్పేరు. అయితే ఆ తరువాత వెళ్ళటం కుదరలేదు మరి!

సుమారు వారం దినాల క్రితం ఆనంద్ మా ఇంటికి వచ్చినపుడు విశ్వపతిగారి ఆరోగ్యం గురించి అడిగేను. ఆయనకి చాలా సీరియస్‌గా ఉందనీ, పరిస్థితి నేడో రేపో అన్నంత ప్రమాదంగా వుందనీ చెప్పేడు.

అందుకే ఒకదినం ఉదయం ఆయనని చూసి వద్దామని బయలుదేరేను. బస్సుదిగి మెయిన్‌రోడ్డు వదలి విశ్వపతిగారి సందువైపు నడిచేను.

ఇల్లు ఇంకో వందగజాల దూరం వుందనగానే ఎదుటి దృశ్యం చూసి స్థంభీభూతుడ నయిపోయేను.

మనసులో దిగులు, కాళ్లల్లో వణుకు పుట్టుకొచ్చి ముందుకు అడుగు వెయ్యలేక పోయాను.

విశ్వపతిగారి ఇంటిముందు బ్రాహ్మలు తడపలు చీరి వెదురుబొంగులు దగ్గరగాచేర్చి ఏదుకట్ల సవారి తయారు చేస్తున్నారు. వెదురుబద్దల మధ్య కొత్తకుండను అమర్చే యత్నంలో వున్నారు ఎవరో యిద్దరు.

ఆశ్చర్యంనుంచి తేరుకుని వణికే కాళ్ళతో అడుగులు వేస్తూ విశ్వపతిగారి యింటిముందుకు చేరుకున్నాను. ముందు వసారాలో విశ్వపతిగారి శవం ఉంది. బ్రాహ్మలు మంత్రాలతో దానికి స్నానం చేయిస్తున్నారు.

ఒక పొడుగు చెంపల జునపాల జుత్తు యువకుడు బ్రాహ్మలకు ఏదో చెపుతూ హడావుడిగా అటూ యిటూ తిరుగుతున్నాడు! వదులుగావున్న బొమ్మల చొక్కా బిగువుగావున్న పంట్లాంతో డాన్సు చేస్తున్నట్లు నడుస్తున్నాడు.

బ్రాహ్మలతోనూ, ఇతర పొరుగు పెద్దలతోనూ అతను మాట్లాడే తీరునుబట్టి ఆయువకుడు విశ్వపతిగారి

అల్లుడయి వుంటాడని వూహించుకున్నాను. బహుశ ఆయన మరణవార్తవిని వచ్చివుంటాడు!

శకుంతల కోసం చూపులతో వెదికాను. లోపల వుందికాబోలు ఎక్కడా కనిపించలేదు.

పొడుగు చెంపల యువకుని వద్దకు నడిచి మెల్లగా "మహానుభావుడు! బ్రతికినంతకాలం ఘనంగా బ్రతికేడు?" అన్నాను. ఆ సమయంలో అంతకంటె ఏం మాట్లాడాలో నాకు తోచలేదు.

ఆ యువకుడు నా వంక అదోలాచూసి ఆ విషయంతో తనకు సంబంధం లేనట్లు తల తిప్పుకోని మళ్ళీ తన పనుల్లో మునిగిపోయేడు. అక్కడ వున్న పెద్ద మనుషులెవరితోనూ నాకు అంతగా పరిచయం లేకపోవడం వలన ఒక వారగా వెళ్ళి నిలబడ్డాను. శకుంతల బయటకు వస్తే ఒకసారి ఓదార్పు మాటలు చెప్పి, వెళ్ళిపోదామని పించింది.

విశ్వపతిగార్ని తీసుకు వెళ్ళడానికి తతంగమంతా పూర్తి అయింది. శవం కదలటానికి సిద్ధంగా వుంది. ఇంతలో శకుంతల బయటకు వచ్చింది. నన్ను చూశాకా ఆమె కంట్లో రెండు నీళ్ళు తిరిగేయి. కళ్ళు ఒత్తుకుంటూ చీరచెంగు నోటికి అడ్డం పెట్టుకుంది.

నేను చెప్పాలనుకున్న ఓదార్పు మాటలు నాలుగూ గబగబా ఒప్పగించేశాను ఐతే; విశ్వపతిగారి మరణం ఆమె మీద నేను ఊహించి నంతగా దెబ్బ తీయలేదని నాకు ఎందుకో అనిపించింది.

ఇంతలో విశ్వపతిగారి వాహనం లే చిం ది! "కాన్వెంటు" ప్రక్కనున్న శ్మశానానికి నడిపించండి' అంటున్నారు ఎవరో!

నాకు మెదడులో ఏదో మెరసి నట్లయింది! విశ్వపతిగారు నాకు చాలాసార్లు చెప్పిన సంగతి జ్ఞాపకానికి వచ్చింది. ఆయన పిసినారి మనిషేకావచ్చు అన్యాయంగా కొత్తలు కొలిచి తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి ఇళ్ళ స్థలాలు ఎక్కువ లాభాలకు అమ్మివుండొచ్చు! కాని ఆయన నాకు చెడు ఏమీ చెయ్యలేదు. నా ఎడల అన్యాయంగా ప్రవర్తించారని నేను అనుకోవడం లేదు! ఆయనకు వుండే బలమయిన కోరిక గురించి నేను ఇప్పుడు యిక్కడ తెలియజేయాల్సిన అవుసరం ఎంతయినా వుంది. శకుంతల మరచిపోతే నన్ను జ్ఞాపకం చేయమని కూడా నాకు చాలాసార్లు చెప్పేరాయన!

అందుకే ఇక ఉపేక్ష చేయకుండా ముందుకు పరుగెత్తి "ఆగండి!" అని అరచేను.

అందరూ నావంక వింతగా చూసేరు. అల్లుడు నా వంక ఉరుముతున్నట్లే చూశాడు! కొంతమంది నన్నో పిచ్చివాడిగా జమ కట్టేరేమోనని కూడా నా అనుమానం.

నేను తొందరగా అడుగు లేసుకుంటూ విశ్వపతిగారి అల్లుడి వద్దకు నడిచేను. "చూడండి విశ్వపతిగార్కి ఒక బలమయిన కోర్కె వుండేది. ఈ ఇంటికి వెనుక ఆయన ప్లాటు అమ్మిన కాలనీ శివారులో రెండువందల గజాల స్థలం ఆయన సమాధి కోసం కేటాయించి వుంచుకున్నారు. కొండ చరియలోని ఆజాగా చూపించేరాయన ఆ విషయం చాలా సార్లు నాతో చెప్పేరు కూడా ఆయన ఆత్మశాంతి కోసం అక్కడే దహనం జరగాలి! అక్కడ ఆయన సమాధి నిర్మించాలి" అన్నాను కాస్త ఆవేశంగా.

అల్లుడు నన్ను పురుగుని చూసినట్లు చూసేడు. తరువాత బొంగురు కంఠంతో "ఇంతకూ మీా రెవరూ?" అన్నాడు.

"నేను ఆయన స్నేహితుణ్ణి! ఆ కాలనీలో ఒక ప్లాటు కూడా కొనుక్కున్నాను." అన్నాను.

ఈ సారి అతడు చిన్నగా నవ్వేడు.

"ఆయన దగ్గర ప్లాటు కొన్నవాళ్ళెవరూ ఆయన స్నేహితులుగా మిగల్లేదు. ఏదో విషయంలో అందరితోనూ

గొడవలూ, పేచీలూ పెట్టుకునే వాడాయన మీకు ఆయనతో సఖ్యతగా వుందనటం వింతగానే వుంది!"

నాకు అతని మాటలకు చికాకేసింది. "చనిపోయిన తరువాత ఇలాటి మాటలన్నీ మనం అనుకోకూడదు. ఆయన దహనం మాత్రం ఆయన కోరిక ప్రకారం జరిగేటట్టు చూడండి" అన్నాను.

"ఈ విషయం నేను ఒప్పుకోను సార్! అది కుదరదు." అన్నాడు బింకంగా.

బ్రాహ్మలు, పొరుగు పెద్దలు మా మాటలు చిత్రంగా వింటున్నారు.

"పోనీ ఆయన అస్థికలు అక్కడ ఈ దినం పాతించండి, తరువాత సమాధి కట్టించవచ్చు" అన్నాను నిస్సహాయ ధోరణిలో ఆ యువకుడుకు ఈ సారి తేలికగా నవ్వేడు.

"ఇప్పుడు ఆ కాలనీలో స్థలాలు ఎంత ఖరీదయ్యాయో తెలుసునా? గజం సుమారు ఎనిమిది రూపాయలు! రెండు వందల గజాలూ పదహారు వందలౌతుంది. అంత ఖరీదయిన స్థలం ఆముసిలాడి సమాధికోసం 'వేస్టు' చేయుమంటారా? అదేం కుదరదు!" అన్నాడు నిశ్చయంగా.

నేను శకుంతల వైపు చూసి "మీరేనా యీ సంగతి చెప్పండి మీ నాన్నగారు యీ విషయంలో మీ మీద ఎంతో నమ్మకంతో వుండేవారు." అన్నాను.

విశ్వపతిగార్కి జరుగుతున్న అన్యాయానికి నాకు చాలా దిగులేసింది. అల్లుడి విషయంలోనూ! కూతురి విషయంలోనూ ఆయన చాలా అన్యాయంగా ప్రవర్తించి వుండొచ్చును గాక! ఇప్పుడిక ఆయన ఎవ్వరికీ ఏమీ కారు! ఆయన ఆస్థిఅంతా ఎలాగూ అల్లుడికే చెందుతుంది. ఇంత డబ్బు చేజిక్కించుకుంటూ, ఇన్ని స్థలాలు కలుపుకుంటూ వుండికూడా; అల్లుడు అంత పెడసరంగా మాట్లాడటం చూస్తే నాకు చాలా బాధ కల్గింది. తను ఆర్జించిన అన్నివేల గజాలలోనూ ఆయన కోరుకున్నది కేవలం రెండువందల గజాలు-తన సమాధి కోసం! ఆయనకు ఆ మాత్రం కోర్కె వుండటం ఎంతయినా సహజం! కాని అది కూడా ఆయనకు తీరేటట్టు లేదు!

శకుంతల భర్తకు నచ్చచెప్తుందని అనుకున్నాను. కాని ఆమెకూడా ఏం మాట్లాడ లేదు. భర్త ముఖంలోకి ఒకమారు చూసి తలదించుకుంది. ఆమెకు ఈ విషయం భర్తతో చెప్పగలిగే ధైర్యంలేదు.

అల్లుడు బ్రాహ్మల వంక తిరిగి "కదిలించండి! మళ్ళీ మంచి ఘడియలు మించి పోతాయి!" అంటూ తొందరచేసి నావైపుకు తిరిగి "బ్రతికి వుండగా కానీ ఖర్చుపెట్టని ముసిలాయనకు చచ్చిపోయాకా సమాధి ఎందుకు సార్! అందు కోసం పదహారు వందల ఖరీదుచేసే స్థలం పాడుచెయ్యటమెందుకు? మీకు తెలుసో, తెలీదో కాని ఆయన బ్రతికున్న

రోజుల్లో స్మశానాలను కూడా ప్లాటువేసి అమ్మేస్తే బావుంటుంది అనేవారట! అందుకే ఆయన కేటాయించుకున్న ప్రేతభూమిని నేను ప్లాటుగా అమ్మెయ్య దల్చుకున్నాను. ఇలా చేస్తే ఆయనకు అంతర్గతంగా వుండే కోరికతీరి, ఆత్మకు అఖండమయిన శాంతి లభిస్తుంది. మీరు పిచ్చిఛాదస్తాలు పెట్టుకోకండి.'' అని ఎగతాళిగా అంటూ బ్రాహ్మల వెంట నడిచేడు.

శకుంతల తల గిరుక్కున తిప్పుకొని ఇంట్లోకి వెళ్ళి పోయింది. కాన్వెంటు ప్రక్కనున్న ప్రేతభూమి దిశగా విశ్వపతిగారి ఏడుకట్ల సవారి కదలిపోతూ వుంటే మ్రాన్పడి చూస్తూ వుండి పోయాను.

కొన్ని వేల గజాల స్థలానికి అధిపతి విశ్వపతిగారు తనదైన- ఆరడుగుల నేలలోకూడా, తన ఉనికిని స్థిరపర చుకోలేక పోయారు.

కొద్ది క్షణాల్లోనే వాహనం ఇంటి మలుపు తిరిగింది.

[జ్యోతి]

* * * *